పట్టింపాలెంలో ట్రాక్టర్ల పందేలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని పట్టింపాలెం గ్రామంలో ట్రాక్టర్ పందేలు సోమవారం నిర్వహించారు. పట్టింపాలెం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం గ్రామాల మధ్య ట్రాక్టర్ పందేలు నిర్వహించారు. రెండు ట్రాక్టర్లకు మధ్యలో మోకు బిగించి ఏ ట్రాక్టర్ అయితే బలంగా అవతలి ట్రాక్టర్ లాగుతుందో ఆ ట్రాక్టర్ పందెంలో గెలిచినట్లు ప్రకటిస్తామని పందేల నిర్వాహకులు తెలిపారు. యువత కోడిపందేలు, జూదం, గుండాట జోలికి పోకుండా ఉండేలా ఈ పందేలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో..

జంగారెడ్డిగూడెం పట్టణం సుబ్బమ్మపేటలో..

జోరు.. బేజారు..!

పెద్ద బరుల వద్ద పందేల హుషారు..

ఖాకీల రాకతో చిన్న బరుల వద్ద పరేషాన్

ఆదివారం నుంచి నిలిచిన గుండాట, ముక్కలాట, ఇతర జూదాలు

మూడో రోజు కానరాని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు

చేతులు మారిన రూ.250 కోట్లు

ప్రజాశక్తి - ఏలూరు

రెండు జిల్లాల్లో కోడిపందేలు మూడోరోజు సోమవారం కొనసాగాయి. మొదటి రోజు కోడిపందేలతోపాటు గుండాట, కోతాట వంటివి యథేచ్ఛగా సాగగా రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి కోడిపందేలు మినహా మిగిలిన అన్నింటినీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ దశలో పందేలు కూడా ఆగుతాయా అనే చర్చ సాగింది. దీంతోపాటు ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలను కూడా పోలీసులు అడ్డుకోవడంతో సోమవారం ఉదయమే పందేలు ప్రారంభమయ్యాయి. గుండాట వంటివి ప్రారంభించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.


గణపవరం మండలం సరిపల్లిలో పందేలను అడ్డుకున్న పోలీసులు

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలి, యలమంచిలి మండలం కలగడంపూడి, భీమవరం రూరల్, ఆకివీడు మండలాల్లో వేసిన బరుల్లో పందేలు లక్షల్లో సాగాయి. ఏలూరు జిల్లాలో కొన్నిచోట్ల పందేలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. అయితే ప్రధాన బరుల జోలికి పోలీసులు వెళ్లలేదని విమర్శలు వెల్లువెత్తాయి. ఉంగుటూరు మండలంలో అధికార పార్టీ నేతలకు చెందిన బరుల్లోకి, జిల్లాలోని పెద్ద బరుల వద్దకు పోలీసులు వెళ్లిన దాఖలాల్లేవు. అయితే మిగిలిన గ్రామాల్లోని చిన్నచిన్న బరులపై దాడులు చేసి గుండాట వంటి వాటిని పూర్తిస్థాయిలో అడ్డుకున్నారు. పందేలను కొన్ని చోట్ల ఆపించగా అధికార పార్టీ నేతల జోక్యం ఉన్న చోట్ల చూసీచూడనట్లు వదిలేశారు. ఆదివారం ఉదయం నుంచి గుండాట వంటివి అడ్డుకోవడం, ఏలూరు జిల్లాలో కొన్నిచోట్ల పందేలను సైతం అడ్డుకోవడంతో ప్రముఖులు, నేతలు సైతం సోమవారం పందేలకు దూరంగా ఉన్నారు. బరుల వద్దకు వెళ్లే నిర్వాహకులు గుండాట వంటివి ఆపేయడంపై ప్రశ్నించే అవకాశం ఉండటం, ప్రసార మాధ్యమాల్లో కన్పిస్తే హైకోర్టు సుమోటాగా కేసులకు ఆదేశాలు జారీ చేసి విచారించే అవకాశం ఉందనే కారణంతో ప్రజాప్రతినిధులు బరులకు దూరంగా ఉన్నట్లు ప్రచారం సాగింది. ఏదేమైనా ఈ మూడు రోజుల్లో పందేల రూపంలోనే రూ.250 కోట్లకుపైగా చేతులు మారినట్లు సమాచారం.

ముదినేపల్లి: మండలంలో పండుగ మూడు రోజులు కోడిపందేలు , పేకాట, గుండాట జోరుగా సాగాయి. మూడు రోజులు పోలీసులు వీటివైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. దీంతో జూదాల జాతర సాగింది. మండలంలోని అన్నవరం, పేరూరు, వడాలి, బొమ్మినంపాడు, ఈడేపల్లి, దేవపూడి గ్రామాల్లో పందేలు జోరుగా నిర్వహించారు. బరులను బట్టి బెట్టింగుల జోరు సాగింది. పెద్దబరుల్లో లక్షల్లో పందేలు కాచారు. మండలంలోని అన్ని బరులూ జాతరను తలపించాయి. పలు అపార్టుమెంట్లలో చేపల చెరువుల గట్లపై, ఇళ్లల్లో పేకాట జోరుగా నిర్వహించారు. బరులువద్ద బైక్‌లు, కార్ల పార్కింగ్‌ను చూసిన జనం నోరెళ్లబెట్టారు. బరుల వద్ద మద్యం, బిర్యానీ, చికెన్‌పకోడీ, శీతల పానీయాలు అమ్మకాలు పెద్దఎత్తున సాగాయి. మొదటి రెండు రోజులు కన్నా మూడో రోజు సోమవారం పందేలు మరింత ఎక్కువగా సాగాయి. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పందెంరాయుళ్లు రెచ్చిపోయారు.

టి.నరసాపురం: సంక్రాంతి పేరుతో మండలంలో కోడి పందేలు మూడోరోజు సోమవారం జోరుగా సాగాయి. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, టి.నరసాపురం, తిరుమలదేవిపేట, బంధంచర్ల గ్రామాల్లో పందెంరాయుళ్లు యథేచ్ఛగా పందేలు నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడ వంటి ఇతర ప్రాంతాల నుండి గ్రామాలకు వచ్చిన వారు ఉత్సాహంగా పందేల్లో పాల్గొని భారీ ఎత్తున బెట్టింగులకు పాల్పడ్డారని సమాచారం. మండలంలో రోజుకు సుమారు రూ.కోటి వరకు చేతులు మారాయని పలువురు చెప్పుకుంటున్నారు. రెండు రోజులపాటు జోరుగా సాగిన గుండాట, పేకాట వంటి జూదాలను పోలీసుల ఆదేశాలతో నిలిపివేశారని స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల పందేలను మహిళలు, యువతులు ఉత్సాహంగా తిలకించారు.

ఉంగుటూరు: మండలంలో యథేచ్ఛగా కోడి పందేలు, పేకాట మూడు రోజులపాటు సాగాయి. నారాయణపురం-గణపవరం రోడ్డు బరిలో పందేలను మాజీ మంత్రి రంగనాథరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ వాసుబాబు కొద్దిసేపు తిలకించారు. అన్నిచోట్లా ఫ్లడ్ లైట్ల వెలుగులో పందేలు జరిగాయి. కొత్త ఉంగుటూరు, నారాయణపురం, గొల్లగూడెం, రాచూరు, చినవెల్లమిల్లి ఒక్కొక్క బరి, బాదంపూడిలో మూడు బరుల్లో కోడి పందేలు నిర్వహించారు. మొదటిరోజు పేకాట, గుండాట జరిగినా రెండో రోజు నుంచి అవి జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నారాయణపురం రాజుల బరిలో బుల్లెట్ బండిని డ్రా తీసి విజేతలకు ఇవ్వనున్నారు. కొత్త ఉంగుటూరు బరిలో జూదరుల మధ్య కొట్లాట చోటు చేసుకోవడంతో ఒకరికి గాయాలయ్యాయి. నారాయణపురంలో బరిలో రూ.ఐదు లక్షల పందెం జరిగింది. మూడురోజులపాటు రూ.కోట్లు చేతులు మారాయి.

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి నేపథ్యంలో కనుమ రోజు కోడిపందేలు జోరుగా సాగాయి. సోమవారం మండలంలోని శ్రీనివాసపురం, ఎ.పోలవరం, వేగవరం, దేవులపల్లి, లక్కవరం, పంగిడిగూడెం తదితర ప్రాంతాల్లో కోళ్లకు కత్తులు కట్టి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. అయితే ఆదివారం నుండి కోడి పందేల బరుల వద్ద గుండాట, కోతాట, లోన బయట వంటి జూద క్రీడల స్థావరాలను పోలీసులు తొలగించారు. ఈ క్రమంలో ఒక వైపు నుండి జూద క్రీడల పందిళ్లను తొలగిస్తుంటే మరోవైపు నిర్వాహకులు మళ్లీ ఏర్పాటు చేసుకున్నారని పలువురు చెబుతున్నారు. జూద క్రీడల నిర్వాహకులు మాత్రం తాము అధికారులకు మామూళ్లు ఇచ్చామని ఇప్పుడు వద్దంటే నష్టపోతామని బహిరంగంగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పందేలు జరగకుండా పోలీసులు నిలువరించారు. రాత్రీ పగలు ఏకధాటిగా కోడి పందేలు జరుగుతాయని ఆశించిన పందెంరాయుళ్లు, గుండాట, కోతాట నిర్వాహకులు నిరుత్సాహానికి గురయ్యారు. సోమవారం ఉదయాన్నే మళ్లీ కోడిపందేలతోపాటు జూద క్రీడల స్థావరాలు వెలిశాయి. మళ్లీ పోలీసులు అడ్డుకోవడంతో జూద క్రీడలను మాత్రం నిలిపివేశారు.

గుట్టుగా పేకాట శిబిరాలు

పట్టణంలో కోడి పందేల వద్ద గుండాట, కోత ఆటలను పోలీసులు అడ్డుకున్నప్పటికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పేకాట శిబిరాలు గుట్టుగా కొనసాగాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో ఉన్న హాలుతోపాటు శ్రీనివాసపురం రోడ్డులో ఏర్పాటు చేసిన మరో స్థావరంలో పేకాట రాత్రీ పగలు కొనసాగించారని స్థానికులు పేర్కొంటున్నారు.

డ్రా తీస్తున్న నిర్వాహకులు

లక్కీడ్రాలో శ్రీవిద్యకు బుల్లెట్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఐస్ ఫ్యాక్టరీ వద్ద కోడి పందేల నిర్వాహకులు బుల్లెట్ బండి లక్కీ డ్రా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన పందేల్లో పాల్గొన్న వారికి రూ.మూడు లక్షల విలువైన బుల్లెట్ బండికోసం టిక్కెట్‌కు రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారు. దానిపై సోమవారం డ్రా తీయగా నిడమర్రు మండలం పత్తేపురానికి చెందిన పత్సమట్ల శ్రీవిద్యకు బుల్లెట్ బండి దక్కింది. ఈసందర్భంగా బండిని విజేత శ్రీవిద్య తండ్రికి నిర్వాహకులు అందజేశారు.

ఎగుమతులు ఫుల్.. ధర నిల్..!

జామాయిల్ రైతుల పెదవివిరుపు

కమీషన్‌దారులకు మాత్రం లాభాల పంట

ప్రభుత్వ పర్యవేక్షణా లోపమే కారణం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో జామాయిల్ సాగు అధికం. ముఖ్యంగా బుట్టాయగూడెం మండలంలో ఈ పంట వేల ఎకరాల్లో జామాయిల్ సాగవుతోంది. బుట్టాయగూడెం మండల కేంద్రంలో శివాలయం సమీపంలో వేబ్రిడ్జి కాటా సమీపంలో జామాయిల్ స్టాకు పాయింట్లు రెండు ఉన్నాయి. ఈ రెండు పాయింట్లు జంగారెడ్డిగూడెంలోని స్టాక్ పాయింట్‌కు అనుసంధానమై ఉన్నాయి. ఈ జామాయిల్ స్టాక్ పాయింట్ల ద్వారా సంవత్సరానికి మూడు వేల టన్నుల జామాయిల్ కర్రలు ఎగుమతి అవుతున్నాయి. ఇవి లారీల ద్వారా గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం జామాయిల్ టన్ను రూ.5200 ఉండగా రైతులకు మాత్రం రూ.3800 మాత్రమే లభిస్తోంది. ప్రధానంగా ఈ జామాయిల్ కర్ర వ్యాపారంలో కమీషన్‌దారులే బాగా లాభపడుతున్నట్లు సమాచారం. జామాయిల్ సాగు చేసి కర్ర విక్రయించే వరకూ అష్టకష్టాలు పడి పెట్టుబడులు పెట్టే రైతులకు ప్రతి సంవత్సరం నిరాశే మిగులుతోంది. అయితే కమీషన్‌దారులు మాత్రం ప్రాసెసింగ్ పేరిట ధర దిగ్గోసి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఎగుమతుల పేరిట తక్కువ ధరకు జామాయిల్ కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. జామాయిల్ కర్రలను ఆయా రాష్ట్రాల్లో సెంట్రింగ్‌కు వాడతామని, అందుకే వీటి ధర బాగుంటుందని తెలిపారు. ఏమైనా ధర ప్రభుత్వమే నిర్ణయించి రైతు కష్టానికి ప్రతిఫలం దక్కేలా నిర్ణయించాలని అంతా కోరుతున్నారు.

పొలం పనులకెళ్తే లోబర్చుకుని..!

దాట్లవారిగూడెంలో అవివాహిత దారుణ హత్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పొట్టకూటి కోసం పొలం పనులకు వెళ్తుంటే నమ్మించి దగ్గరయ్యాడు. ఆపై గర్భం రావడంతో తనను పెళ్లి చేసుకోమని అడగడమే ఆ మహిళకు శాపమైంది. రెండేళ్ల పరిచయం.. చెప్పిన కబుర్లు మాయమై అత్యంత కర్కశంగా ఆమె ప్రాణాలు తీశాడు. మండలంలోని దాట్లవారిగూడెంలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

వెంకటలక్ష్మి (ఫైల్‌ఫొటో)

నిందితుడు లక్ష్మణరావు

దాట్లవారిగూడెం గ్రామానికి చెందిన సున్నం వెంకటలక్ష్మి (35) కూలి పనులకు వెళ్తుంటుంది. అదే గ్రామానికి చెందిన మొడియం లక్ష్మణరావుకు వ్యవసాయ భూములున్నాయి. అయితే అతనికి వివాహం కావడం, భార్య ఉద్యోగి కావడంతో ఆరేళ్ల నుంచి జంగారెడ్డిగూడెంలో నివాసముంటున్నాడు. లక్ష్మణరావు ప్రతిరోజూ దాట్లవారిగూడెం వచ్చి వ్యవసాయ చూసుకుంటూ ఉంటాడు. ఈ క్రమంలో లక్ష్మణరావు పొలం పనులకు వెళ్లిన వెంకటలక్ష్మితో రెండేళ్ల నుంచి సన్నిహితంగా ఉంటున్నాడు. ఫలితంగా వెంకటలక్ష్మి గర్భం దాల్చింది. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని ఆమె కోరుతోంది. ఈ క్రమంలోనే ఈ నెల 11న వీరిద్దరు కలుసుకున్నారు. మళ్లీ పెళ్లి ప్రస్తావన రావడంతో లక్ష్మణరావు వెంకటలక్ష్మి తలపై బండరాయితో మోది హత్య చేశాడు. ఆపై మృతదేహాన్ని ఎవరికీ కన్పించకుండా రాళ్లదిబ్బల వద్ద పూడ్చేశాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన కుమార్తె రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో తల్లిదండ్రులు, సోదరుడు అన్నిచోట్లా గాలించారు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కీడు శంకించి ఆదివారం వారు పోలీసులను ఆశ్రయించారు. వెంకటలక్ష్మి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానితుడైన లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని విచారించగా తానే హతమార్చినట్లు అంగీకరించినట్లు సమాచారం. అతడిచ్చిన సమాచారంతో తహశీల్దార్ ఎలీషా, సిఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ చంద్రశేఖర్ దాట్లవారిగూడెం గ్రామ శివార్లలో రాళ్లదిబ్బల వద్ద పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు ఆట స్థలాలు కేటాయించాలి

ప్రజాసంఘాలు, సంస్థలు ఆధ్వర్యాన ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించాలని కౌలురైతుల సంఘం మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం కేశవరంలో సంఘం ఆధ్వర్యంలో మూడు కేంద్రాల్లో యువతీ యువకులకు వాలీబాల్, కబడ్డీ, కుండ కొట్టడం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ పండగ రోజుల్లో యువతీ యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీరవల్లి నాగేశ్వరరావు, పెచ్చెట్టి హన్సిక, పెచ్చెట్టి లక్ష్మి, వీరవల్లి గంగారత్నం, బొక్కా శ్రీను, గుబ్బల నాగలక్ష్మి పాల్గొన్నారు.

కలిదిండి మండలంలో..

ఏలూరు: సంక్రాంతి సందర్భంగా స్థానిక పత్తేబాద బ్రహ్మం గుడి వీధి సెంటర్లో డివైఎఫ్ఐ, ఎపి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతియేటా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు ఆయా సంఘాల నేతలు కొల్లి ఈశ్వర్, పిచ్చుక ఆదిశేషు తెలిపారు. 1988 నుండి నేటి వరకు ప్రజల సహకారంతో ఆటల పోటీలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని ఆదిశేషు తెలిపారు వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలిన రామయ్యగౌడ్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ప్రజల సహకారంతో సంక్రాంతి సంబరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు రామయ్య గౌడ్, ఆయన సతీమణి కాత్యాయని, సోషల్ వర్కర్ అల్లం సుబ్బారావు చేతుల మీదుగా బహుమతులు అందించినట్లు ఈశ్వర్, పిచ్చుక ఆదిశేషు తెలిపారు.

చింతలపూడి: పండుగల పేరుతో యువత కోడి పందేలు, పేకాట వంటి దురలవాట్లకు గురికాకుండా ఉండేందుకు ఆటల పోటీలు దోహదపడతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో పాత చింతలపూడిలో నిర్వహించిన కబడ్డీ, ముగ్గులు, రన్నింగ్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానంలో ఆయన పాల్గొన్నారు. తొర్లపాటి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఆటల పోటీలతో గ్రామీణ ప్రాంత యువతలో దాగిఉన్న ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి పుల్లూరి సోమశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇమ్మానియేలు, మాజీ వార్డ్ మెంబర్ కంభం సుజాత, ప్రముఖులు బోడ వజ్రం, ఎస్‌కె.జానీ, ఎస్‌కె.మస్తాన్, ముల్లగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం మండలం కేశవరంలో..

చింతలపూడిలో..

భీమడోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమను పురస్కరించుకొని సోమవారం పొలసానిపల్లిలో ఎపి మహిళా మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లత, కె.ఇందిర, వి.లక్ష్మి, దుర్గాభవాని పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలోని కోరుకొల్లు, మూలలంక, భాస్కరరావుపేట, సానా రుద్రవరం గ్రామాల్లో బాల బాలికలకు, యువతకు, మహిళలకు రన్నింగ్, మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి శ్రామిక సంబరాలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. యువత కోడిపందేలు, పేకాట వైపు మరలకుండా శ్రామిక పేటల్లో ఆటల పోటీలు నిర్వహించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శేషపు మహంకాళరావు అన్నారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మహాలక్ష్మి, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ముంగం సురేష్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పంతగాని ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కుల మహేష్, వీరవల్లి భాస్కరరావు, కుడిపూడి శ్రీను, సన్నీ, వినోద్, బుస్సా రామ నాగేంద్రం, దొంగ వెంకట సత్యన్నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: సంక్రాంతి సందర్భంగా సోమవారం జల్లికాకినాడ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఆర్.సుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఎం మండల నాయకులు ఎం.పెంటారావు మాట్లాడారు. విజేతలకు గ్రామ ఉప సర్పంచి బొక్కా చినరంగారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పి.నరసింహమూర్తి, పి.సూర్యనారాయణ, కేతా శ్రీనివాస్, సోడదాసి సంజీవరావు, వేగేశ్న సూర్యానారాయణ పాల్గొన్నారు.

పండుగ వేళ

కూర'గాయాలు'

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్రాంతి సందర్భంగా అన్ని నిత్యావసర వస్తువుల ధరలతో పాటు స్వీట్లు, కేకులు, చివరకు కూరగాయాల ధరలు సైతం పెరిగాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. సంక్రాంతికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా కాయగూరల కోతలకు కూలీలు రాకపోవడంతో టమాటా నుంచి అన్ని కాయగూరల ధరలు పెరిగాయి. పండగ ముందు కిలో రూ.20 ఉన్న టమాటా ప్రస్తుతం రూ.30కు చేరింది. బంగాళదుంపలు కిలో రూ.20 నుంచి రూ.30లకు, వంకాయలు కిలో రూ.45 నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.60లకు విక్రయిస్తున్నారు. కోడిగుడ్డు ధర కూడా పైపైకి ఎగబాకుతోంది. హోల్‌సేల్‌లో 6.25 రూపాయలు ఉండడంతో రిటైల్‌గా రూ.7 అమ్ముతున్నారు.

విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

సంధ్యా సమయాన ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి - వీరవాసరం

యువత అభిరుచికి తగ్గగట్టుగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు అనుకున్నది సాధిస్తారని రాష్ట్ర సాంస్కృతిక నాటక కళాపరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దా వెంకట్రామయ్య అన్నారు. వికె మీడియా ఎంటర్‌ట్రైన్‌మెంట్ వారి సంధ్యా సమయాన షార్ట్‌ఫిల్మ్ ట్రైలర్, పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక కళాపరిషత్ సమాఖ్య సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకట్రామయ్య మాట్లాడుతూ సమాజం హితం కోరి చెప్పాలనుకున్నది షార్ట్ ఫిల్మ్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సందేశాన్ని చెప్పే అవకాశం ఉంటుందన్నారు. రెండున్నర గంటల సినిమా కథను పదిహేను నిమిషాల వ్యవధిలో చెప్పడం కత్తిమీద సాములాంటిదన్నారు. వికె మీడియా ఎంటర్‌ట్రైన్‌మెంట్ వ్యవస్థాపకులు కూనపరెడ్డి వినయ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నూతన నటీనటులకు అవకాశ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్‌కు నిర్మాతలుగా కూనపరెడ్డి జయరాజు, జయలక్ష్మీ వ్యవహరించారన్నారు. అనంతరం ట్రైలర్‌ను బుద్దా వెంట్రామయ్య, పోస్టర్‌ను ఎపి సాంస్కృతిక కళా పరిషత్ సమాఖ్య కార్యదర్శి జవ్వాది దాశరథి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, వీరవాసరం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, వీరవాసరం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

379 రకాల పిండి వంటలు

గోదారోళ్ల ఆతిథ్యం.. ఎంతో ప్రత్యేకం

కొత్త అల్లుడికి 379 రకాల పిండి వంటకాలతో విందు

ప్రజాశక్తి - ఏలూరు

ఇంటికి కొత్త అల్లుడు.. లేదా కాబోయే అల్లుడు ఇంటికి వచ్చాడంటేనే ఆ మర్యాద వేరే లెవెల్లో ఉంటుంది. ఇక గోదావరి జిల్లాల్లో అయితే అది మరింత ప్రత్యేకం.. ఎందుకంటే ఇక్కడి మర్యాదలే వేరు.. ముఖ్యంగా భోజన ప్రియులకు కడుపు నింపేస్తారు. వెరైటీ వెరైటీ వంటకాలతో నోరు ఊరేలా చేస్తారు. జనం తమ గురించి గొప్పగా చెప్పుకునేలా.. రికార్డు స్థాయి పిండి వంటలను రెడీ చేస్తారు. ఆ తరహాలోనే ఇప్పుడు ఏలూరులో కూడా తగ్గేదే లే అంటున్నారు. అత్తమామలు అల్లుడికి ఇచ్చిన మర్యాద చూస్తే ఎవరైనా నోరెళ్లబెడతారు. కేవలం మాటల ద్వారా స్వాగతం పలకడమే కాదు.. 379 రకాల పిండి వంటలు చేసి కొత్త దంపతులకు ఆహ్వానం పలికారు. ఈ వేడుక చాలా సందడిగా సాగింది. అనకాపల్లికి చెందిన మురళీధర్ ఏలూరుకు చెందిన భీమారావు కుమార్తెతో వివాహమయ్యాక తొలి సంక్రాంతి పండుగకు అల్లుడు, కూతురిని ఇంటికి పిలిచారు. వారికోసం రకరకాల పిండి వంటలతో విందు ఏర్పాటు చేసి అల్లుడిని ఆశ్చర్యపరిచారు.

బహుమతులను అందిస్తున్న ఎస్ఐ చంటిబాబు

మహిళలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆగిరిపల్లి పోలీసుల సౌజన్యంతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సంక్రాంతి సంబరాలు ఉట్టిపడేలా పలు రకాలైన ముగ్గులను వేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన ముగ్గురిని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎస్ఐ చంటిబాబు అందించి అభినందించారు.

పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1986-87లో పదో తరగతి చదివిన విద్యార్థులు 37 ఏళ్ల తరువాత వారు చదువుకున్న పాఠశాలలో కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఉద్యోగరీత్యా దేశ విదేశాల్లో స్థిరపడినవారంతా ఒకే కుటుంబంలా ఒక్కటయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అమెరికా, హైదరాబాద్, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి రావడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరువలేదు. నాటి గురువులైన చెరుకూరి పూర్ణ చంద్రరావు, పెండ్యాల వెంకటేశ్వరరావు, వేమూరి సత్యవతి, రామలక్ష్మిని ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. నాటి పదో తరగతి బ్యాచ్ మిత్రులందరిని కలిసేందుకు అమెరికా నుంచి వచ్చినట్లు తానా నేషనల్ స్పోర్ట్స్ చైర్ పర్సన్ యార్లగడ్డ రజనీకుమార్ ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విద్యుత్ ఎడిఇ బత్తిన శివరామప్రసాద్, బోటెక్ అధినేత ఎస్.సరళ, విశాఖపట్నం సిఐఎస్ఎఫ్ ఎం.రంగారావు, ఎఎస్ఐ బొల్లా రాంబాబు, ఏలూరు హెడ్ కానిస్టేబుల్ బత్తిన రామ తులసీరావు, సజ్జా మురళీకృష్ణ, మంతెన రామరాజు, గంగవరపు శ్రీహరి, కట్టా శ్రీనివాసులు, బివిజి.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న జ్ఞానసుందరరావు

విద్యార్థులకు సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి - కలిదిండి

విద్యాభివృద్ధే లక్ష్యంగా పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు దాత రెవరెండ్ ఫాదర్ డాక్టర్ సురేష్‌కుమార్ రేమల్లి అన్నారు. మండలంలోని భాస్కరరావుపేటలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 50 నిరుపేద కుటుంబ విద్యార్థులకు 50 సైకిళ్లను సర్పంచి గద్దె అనిల్ కుమార్, పిఎసిఎస్ డైరెక్టర్ ఆర్.జ్ఞానసుందరరావు చేతుల మీదుగా అందించారు. రూ.3.60 లక్షల విలువైన 50 సైకిళ్లు, వంద మందికి చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. భాస్కరరావుపేటలోని విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే మూడు కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉండడంతో వారి విద్యకు ఆటంకం లేకుండా దాత సునీల్ కుమార్ సైకిళ్లు అందించడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఛైర్మన్ అల్లూరి ఎస్ఐ రాజు, సునీల్ కుమార్ ప్రభావతి, శాంతి శ్రీ, అధ్యాపకుడు మేడేపల్లి వెంకయ్య, మద్దిరాల జోజిబాబు, టి.యాకోబు పాల్గొన్నారు. అదే గ్రామానికి చెందిన అమలాపురంలో ఎక్సైజ్ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న పొంగులేటి దశమంతరావు, కవిత దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు, మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించి రూ.50 వేల విలువైన బహుమతులు, చీరలు అందించారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రొద్దువాకలో కలుషిత నీరే దిక్కు

మరమ్మతులకు గురైన ఫిల్టర్‌బెడ్స్

స్పందించని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ప్రొద్దువాకలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఆక్వారంగ విస్తరణతో పంట కాలువలు కలుషితంగా మారాయి. ఆ నీటినే మంచినీటి చెరువుల్లో నింపుతున్నారు. చెరువుల్లో నీరు నింపిన కొన్ని రోజులకే నీరు రంగు మారుతోంది. ఆ నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. కలుషిత నీరు వల్ల తాము అనారోగ్యానికి గురవుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని పొద్దువాక గ్రామ జనాభా వెయ్యిపై చిలుకు ఉన్నారు. మైనర్ పంచాయతీ గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ ఉంది. 12 వేల పైచిలుకు లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నప్పటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా సక్రమంగా లేదు. గ్రామంలో 450 పైచిలుకు ప్రయివేటు కుళాయి, 80 వరకు పంచాయతీ పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. గ్రామస్తులు కొందరు విద్యుత్ మోటార్ల వినియోగంతో శివారు ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదు. దీంతో ప్రజలు నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏదాది పొడవునా నీటి కోసం పాట్లు తప్పడం లేదు.

వాటర్‌ట్యాంక్



మరమ్మతులకు గురైన ఫిల్టర్‌బెడ్

కలుషిత నీరే దిక్కు

ఫిల్టర్ బెడ్స్ సరిగా పని చేయడం లేదు. దీంతో ఆ నీటినే కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. మలినాలతో వచ్చిన నీటిని తాగలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా కలపడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్‌బెడ్స్‌ను వెంటనే బాగుచేయించి శుద్ధ జలాలు అందించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

ప్రజలకు శుద్ధ జలాలు అందించాలి

జి.నారాయణ, గ్రామస్తుడు

ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులకు గురయ్యాయి. వాటిని వెంటనే బాగు చేయించాలి. కుళాయిల ద్వారా సరఫరా చేసే కలుషిత నీరు తాగలేకపోతున్నాం. దీంతో వాటర్ టిన్నుల నీరు కొనుక్కుంటున్నాం. పంచాయతీ నిర్వహణ సక్రమంగా లేదు. ఫిల్టర్‌బెడ్స్ బాగు చేయించి వెంటనే శుద్ధ జలాలను కుళాయిల ద్వారా సరఫరా చేయాలి. అధికారులు, పాలకులు స్పందించాలి.

ఎంఎల్‌సి రిపోర్టుపై స్పందన కరువు

వికాస్ విద్యాసంస్థల విద్యార్థి తల్లి లక్ష్మి ఆవేదన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ కుమారుడిపై పోలీసులు లాఠీ చార్జ్ చేసి గాయపరిచిన సంఘటనలో మెడికల్ లీగల్ కేసుపై అధికారులు స్పందించడం లేదని బాధితురాలు కొండపల్లి లక్ష్మి వాపోయారు. ఎంఎల్‌సి రిపోర్ట్‌పై అధికారులు స్పందించడం లేదని గత రెండు రోజులుగా వికాస్ పాఠశాల విద్యార్థి చైతన్యతో పాటు తల్లి కొండపల్లి లక్ష్మి ఏరియా ఆసుపత్రి వద్ద అసహనం చేస్తూ పోస్టు చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇటీవల వికాస్ పాఠశాల సంక్రాంతి సంబరాల్లో పోలీసులు విచక్షణా రహితంగా లాఠీ చార్జ్ చేసి తమ కుమారుడు చైతన్యను గాయపరచడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్చామని అతని తల్లి లక్ష్మి తెలిపింది. పాఠశాల యాజమాన్యంతో ఉన్న ఇబ్బందులకు విద్యార్థులు, తల్లిదండ్రులపై కక్ష సాధింపు చేయడం సరికాదని ఆమె వాపోయారు. ఎంఎల్‌సి రిపోర్ట్ నకలు కాపీ ఇవ్వాలని అడిగితే ఏరియా ఆసుపత్రి ఔట్‌పోస్టులో పోలీస్ సిబ్బంది కుదరదని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. తాము ఇచ్చిన స్టేట్‌మెంట్ మార్పు చేస్తారనే అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించినప్పటికీ ఎవరూ స్పందించడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని బాధితురాలు కొండపల్లి లక్ష్మి కోరుతున్నారు.

ఆవేదన చెందుతున్న లక్ష్మి

నిర్లక్ష్యంగా రహదారి విస్తరణ పనులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి విస్తరణ పనులతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుత్తేదారుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పనులతో పైపులైన్లు పగిలిపోయి గ్రామస్తుల దాహార్తిని తీర్చాల్సిన స్వచ్ఛమైన తాగునీరు మట్టి పాలవుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి165 పామర్రు దిగమర్రు మండవల్లి వద్ద రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. గుత్తేదారుడు ప్రారంభం నుంచి పనుల్లో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాడని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. రహదారి విస్తరణలో ఇళ్ల స్థలాలు నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించకుండానే గృహాలను, ప్రహరీ గోడలను పడవేసేస్తున్నారని, దీనిపై అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుడు నిర్వహిస్తున్న నిర్లక్ష్య పనుల వల్ల సంక్రాంతి పండుగలో తాగేందుకు, వాడుకునేందుకు నీరు లేక నాన్న అవస్థలు పడ్డామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందడంలేదని, నిర్లక్ష్య పనుల కారణంగా అధిక విద్యుత్ ప్రసారమై కరెంట్ గృహోపకరణాలు కాలిపోయాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం దారుణమంటున్నారు. గుత్తేదారుడు కాంట్రాక్ట్ పనులు నిర్వహించుకుని ఆర్థికంగా లాభం పొందేందుకు నిర్వహిస్తున్న పనుల్లో తామేందుకు ఇబ్బందులు పడాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండవల్లిలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించి గుత్తేదారుడిపై చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా, గ్రామస్తులకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధిక కరెంటు ప్రసారమై విద్యుత్ ఉపకరణాలు కాలిపోయిన వారికి నష్టపరహారం అందించాలని కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ జనార్ధన్‌రావును వివరణ కోరగా సమస్యలను ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రోడ్డుపైకి చేరిన నీరు

రోడ్డంతా దుమ్ము, ధూళి

బుట్టాయగూడెం - చేగుంటపల్లి రోడ్డు దుస్థితి

ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయిగూడెం మండల కేంద్రంలోని హైస్కూల్ సెంటర్ వద్ద నుంచి బుసరాజుపల్లి శివారు కొత్త చేగుంటపల్లి వరకు రోడ్డు అధ్వానంగా తయారై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై వేసిన డస్ట్ కంకర మిశ్రమం వల్ల రోడ్డుపై విపరీతమైన దుమ్ము పైకి లేచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైస్కూల్ సెంటర్ వద్ద నుంచి బుసరాజుపల్లి శివారు కొత్త చేగుంటపల్లి వరకు రూ.3.10 కోట్ల ఎంఎంసి నిధులతో పంచాయతీరాజ్ ద్వారా రోడ్డు నిర్మాణ పనులకు గత నెలలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శంకుస్థాపన చేశారు. కొంతకాలం వరకు రోడ్డు పనులు బాగానే జరిగాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయిన కారణంగా ప్రజలు కొంతకాలంగా ఇప్పలపాడు సమీపంలోని పెట్రోలు బంకు నుంచి పైదవారిగూడెం మధ్య ఉన్న రోడ్డులో ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే ఆ రోడ్డు కూడా పాడైపోవడంతో ప్రజలు మళ్లీ హైస్కూల్ సెంటర్ వద్ద నుంచి బుసరాజుపల్లి శివారు కొత్త చేగుంటపల్లి వరకు రోడ్డులోనే ప్రయాణిస్తున్నారు. రోడ్డుపై వేసిన డస్టు కంకర మిశ్రమం వల్ల విపరీతమైన దుమ్ము పైకి లేచిపోతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ దుమ్ము కారణంగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డు కంటే వెనుక ప్రారంభమైన బుట్టాయగూడెం - కన్నాపురం రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుందని, ఈ రోడ్డు ఎందుకు ఇంకా పూర్తి చేయడం లేదని ప్రజల ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాహన చోదకులు వాపోతున్నారు. ఒక వాహనం ముందు వెళ్తే వెనకాల ఉన్నవారికి ఈ దుమ్ము వల్ల ఎదురుగా ఎవరు వస్తున్నారో కనిపించడం లేదని చెబుతున్నారు. కనీసం ఉదయం, సాయంత్రం రోడ్డును నీటితో తడపాలని, సంబంధిత అధికారులు త్వరగా స్పందించి ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

దుమ్ముమయంగా ఉన్న రోడ్డు

కోడిపందేలు, పేకాట స్థావరాలపై దాడి

గణపవరం :మండలంలోని పలు గ్రామాల్లో గుండాట, పేకాట, కోడిపందేల శిబిరాలపై గణపవరం పోలీసులు శనివారం రాత్రి దాడి చేసి శిబిరాలను తొలగించారు. ఈ సందర్భంగా గణపవరం సిఐ ఎంవి.సుభాష్, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సరిపల్లి, చిన్న రామచంద్రపురం, కేశవరం, ముగ్గళ్ల, మొయ్యేరు, చిలకంపాడు గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై దాడి చేసి వాటిని తొలగించినట్లు చెప్పారు. లాభాపేక్షతో పేకాట, గుండాట నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాట ఆడుతున్న 17 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కంసాలిగుంటలో ఓ గెస్ట్ హౌస్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8.45 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.

చింతలపూడి :సాంప్రదాయం పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి గుండాట నిర్వహిస్తున్నవారిపై కేసులు నమోదు చేసి శిబిరాలను తొలగించారు. చింతలపూడి సిఐ మల్లేశ్వరావు పర్యవేక్షణలో చింతలపూడి ఎస్ఐ డి.హరికృష్ణ తన సిబ్బందితో మండలంలోని పలు చోట్ల గుండాట, జూదాల శిబిరాలపై దాడులు చేశారు. ఈ దాడిలో పలువురిపై కేసులు నమోదు చేసి శిబిరాలు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరికృష్ణ మాట్లాడుతూ సాంప్రదాయ ముసుగులో జూదాలు నిర్వహిస్తున్నవారిపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తామని చెప్పారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. జూదాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.

జీలుగుమిల్లి :మండల వ్యాప్తంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న కోడి పందేలను పోలీసులు చెదరగొట్టారు. పోలీసుల ఆంక్షలను గాలికొదిలేసి సంప్రదాయం ముసుగులో ప్రజా ప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో కోడి పందేలు జోరుగా నిర్వహించారు. జీలుగుమిల్లి తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావడంతో అక్కడ పందెం రాయుళ్లు ఇటు వైపునకు రావడంతో బరుల వద్ద జనాలు బారులు తీరారు. పేకాట, గుండాట వంటి జూద క్రీడలు పెద్ద ఎత్తున నిర్వహించారు. పండుగ పూర్తవ్వడంతో సోమవారం వెళ్లి కోడిపందేల బరులను, పేకాట శిబిరాలను ధ్వంసం చేశారు.

జంగారెడ్డిగూడెం : పట్టణ, మండల ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న కోడి పందేలను నిలుపుదల చేశామని ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు. స్థానిక సుబ్బంపేటలో నిర్వహిస్తున్న కోడిపందేలను పోలీసులు సోమవారం నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్‌బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల్లో కోడిపందేలు, పేకాట, గుండాట తదితర జూద క్రీడలు నిర్వహిస్తున్న 55 మందిపై 25 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఐతు గంటల నుంచి పూర్తి స్థాయిలో కోడిపందేలను నిలుపుదల చేశామని ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు.

ముసునూరు : మండలంలో అధికార పక్ష నాయకుల అండదండాలతో కోడిపందేలు నిర్వహించారని మండల ప్రజలు చెబుతున్నారు. అధికార పక్ష నాయకులు పోలీసులతో కూడా సంబంధం లేకుండా ఎంఎల్ఎ అనుచరులతో కలిసి ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాట్లు చేసి రాత్రి, పగలు తేడా లేకుండా కోడిపందేలు నిర్వహించారు. ఈ మూడు రోజుల్లో రూ.కోట్లు చేతులు మారాయి. పేకాట, గుండాట పెద్దఎత్తున నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజులు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎం.కుటుంబరావు తన సిబ్బందితో గోపవరంలో దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,540 నగదు స్వాధీనం చేసుకున్నారు. చక్కపల్లిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2500, లోపూడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2360 నగదు, రెండు కోడిపుంజులు, నాలుగు కోడి కత్తులు, చిల్లబోయినపల్లిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2580 నగదు, రెండు కోడిపుంజులు, నాలుగు కోడి కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు.

101 కేసులు నమోదు

ఉంగుటూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా గణపవరం సర్కిల్ పరిధిలో 101 కేసులు నమోదు చేసి 281 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,07,905 నగదు, 48 పందెం కోళ్లు, 52 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని సిఐ ఎంవి.సుభాష్ చెప్పారు. కోడిపందేలు, గుండాట, పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు తెలిపారు. గణపవరం, నిడమర్రు, చేబ్రోలు ఎస్ఐలు వి.వెంకటేశ్వరరావు, కె.గుర్రయ్య, కె.స్వామి, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

కోడి కత్తి తగిలి ఇద్దరికి గాయాలు

ముసునూరు : కోడి కత్తి తగిలి ఇద్దరు గాయాలపాలయ్యారు. మండలంలోని ముసునూరు గ్రామంలో ఒక వ్యక్తికి కోడి కత్తి తగిలి చేతికి, చక్కపల్లి గ్రామంలో మరో వ్యక్తికి కాలి వేలికి గాయమైంది.

ప్రకటన

In The Court Of The Senior Civil Judge Court : Bhimavaram

I.A.No. 399/2022
I.A.No. 400/2022
I.A.No. 401/2022
in O.S.No. 245/2015

Plaintiff /Petitioner:
Dasetti Appalanarasamma
AND
Respondents /Defendants:
1) Muchi Srinivasa Rao (Died)
2) Muchi Lakshmi, W/o. Late Srinivasa Rao, R/o. Sri Sayana Street, Gunupudi, Bhimavaram, W.G.Dist.
3) Muchi Teja, S/o. Late Srinivasa Rao, R/o. Sri Sayana Street, Gunupudi, Bhimavaram, W.G.Dist.

పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం పిటీషన్ నోటీసులు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్టు ద్వారాను పంపించినను, వాటిని మీరు అందుకొని యుండుట లేదు. అందువలన మీరు **ది.18-01-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరుచుకొనవలెను.** అట్లు హాజరు కానిచో మీ పరోక్షంలో సదరు పిటీషనును తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పి.రాజారావు
భీమవరం, పిటీషనరు తరుపు అడ్వకేట్ భీమవరం.
15-1-23. సెల్: 94401 30111

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

I.A.No. 381/2021
O.S.No. 442/2021

Between:
Sri. Thota Musalayya ***...Petitioner /Plaintiff***
AND
Sri. Karri Srinivas ***...Respondent /Defendant***

డిఫెండెంట్:
కర్రి శ్రీనివాస్, తండ్రి: ఆదినారాయణ వయస్సు 65 సం॥లు, వ్యాపారం మరియు వ్యవసాయం, డోర్ నెం. 3-102, చిలకంపాడు (Ch.అగ్రహారం), గణపవరం మండలం.

పై నెంబరు పిటీషనులో వాది ప్రతివాదికి ఎన్నిమార్లు పిటీషను నోటీసు పంపినను అమలు కానీ కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పిటీషను నోటీసులు అమలు నిమిత్తం పత్రిక ప్రకటన ద్వారా అమలు చేసే విధముగా ఆర్డరు పొందియున్నారు. కావున పిటీషనులో ఎట్టి ఆక్షేపణ ఉన్న యెడల తెలియజేసుకొనుటకు **ది. 30-01-2023వ తేదీ ఉదయం 10:30 నిముషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని ప్లీడర్ ద్వారా గాని ఆక్షేపణ తెలియజేసుకొనవలెను.** లేని యెడల వారి పరోక్షమందు పిటీషను తదుపరి చర్యలు జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)

వాయిదా తేదీ: 30-01-2023

తాడేపల్లిగూడెం, **మద్దా శ్రీనుబాబు**
అడ్వకేటు, తాడేపల్లిగూడెం.
సెల్: 9963739591,7997744888

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

O.S.No. 442/2021

Between:
Sri. Thota Musalayya ***...Plaintiff***
AND
Sri. Karri Srinivas ***...Defendant***

డిఫెండెంట్:
కర్రి శ్రీనివాస్, తండ్రి: ఆదినారాయణ వయస్సు 65 సం॥లు, వ్యాపారం మరియు వ్యవసాయం, డోర్ నెం. 3-102, చిలకంపాడు (Ch.అగ్రహారం), గణపవరం మండలం.

పై నెంబరు దావాలో వాది ప్రతివాదికి ఎన్నిమార్లు దావా సామాన్లు పంపినను అమలు కానీ కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం దావా సామాన్లు అమలు నిమిత్తం పత్రిక ప్రకటన ద్వారా అమలు చేసే విధముగా ఆర్డరు పొందియున్నారు. కావున దావాలో ఎట్టి ఆక్షేపణ ఉన్న యెడల తెలియజేసుకొనుటకు **ది. 30-01-2023వ తేదీ ఉదయం 10:30 నిముషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని ప్లీడర్ ద్వారా గాని ఆక్షేపణ తెలియజేసుకొనవలెను.** లేని యెడల వారి పరోక్షమందు దావా తదుపరి చర్యలు జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)

వాయిదా తేదీ: 30-01-2023

తాడేపల్లిగూడెం, **మద్దా శ్రీనుబాబు**
అడ్వకేటు, తాడేపల్లిగూడెం.
సెల్: 9963739591,7997744888

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో తాడేపల్లిగూడెం

ఐ.ఎ.నె. 92/2021
ఇన్ ఓ.ఎస్.నెం. 97/2021

మధ్య:
పిటీషనరు /వాది:
శ్రీ దండమూడి వెంకటేశ్వరరావు
మరియు
రెస్పాండెంటు /ప్రతివాదులు:
శ్రీ దండమూడి రామచంద్రరావు వగైరాలు

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు దండమూడి వెంకటేశ్వరరావు గారు పై ప్రతివాది మరియు నాల్గురిపై పై దావా గ్రంథమును సల్పగా అందున మీరు 4వ రెస్పాంటెంటు /ప్రతివాదియైవున్నారనియు సదరు దావా /పిటీషను పరిహారము నిమిత్తము మీకు ఎన్నిమారులు నోటీసు మరియు సమను పంపినను మీరు సదరు సర్వీసులను తీసుకొనక కాలహరణం గావించుచున్నారు.

కావున యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు ఖుద్దున గాని విషయ అవగాహన కలిగిన వకీలు ద్వారా **ది.18-01-2023న వచ్చి తరపున తగు కౌంటరు మరియు స్టేటుమెంటులు దాఖలు చేసుకొనగలరు.** అట్లు కాని పక్షమున మీ అభిముఖము లేకనే సదరు దావా గ్రంథమును పరోక్షముగా తీర్పును కావించగలరని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

// కోర్టు వారి ఆదేశము మేర //

వాయిదా తేదీ: 18-01-2023

4వ ప్రతివాది / పిటీషనరు అడ్రసు:
శ్రీ దండమూడి వీర్రాజు, తండ్రి: వీరరాఘవులు, హిందూ, వ్యవసాయం, యింటి నెం. 14-12-8/1, బిషాన్ కటక్, రాయఘర్ డిస్ట్రిక్ట్, వడిస్సా.

యాళ్లబండి రామకృష్ణపరమహంస
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 99481 69761